# 6. దసరా

(అవి దసరా నవరాత్రుల రోజులు. అది ముంబయిలో ఒక కాలని. కాలని మధ్యలో చక్కగా అలంకరించిన రంగురంగుల షామియానా, అందులో ఒక మూల కోలాటం కర్రలు, వాయిద్యాలు ఉన్నాయి. కొన్ని కుర్చీలు కూడా వేసి వున్నాయి. ఆహూతులు అందరితో ఆ ప్రాంగణం కళకళలాడుతోంది. ఇంకొద్ది సేపట్లో కోలాటం (దాండియా) గర్భానృత్యం మొదలవుతాయి. పిల్లలంతా ఒక చోట చేరారు. ప్రణవి వాళ్ళ నాన్నమ్మతో వచ్చింది.)

YKSJZH



**ప్రణవి** : నాన్నమ్మా! వీళ్ళంతా నా స్నేహితులు. గౌరవ్, షబ్నమ్, లక్కీ సింగ్, మేరి.

**పిల్లలు** : (ముక్త కంఠంతో/ఒక్కసారిగా) నమస్కారం నాన్నమ్మ.

**నాన్నమ్మ** : మీ అందరికీ నా ఆశీస్సులు. మిమ్మల్ని ఇలా కలుసుకోవడం నాకు చాలా ఆనందంగా ఉంది.

**లక్కీ సింగ్** : ఈ తొమ్మిది రోజులు ఎంతో సంతోషంగా గడిచాయి. రేపు దసరా!

**షబ్నమ్** : మళ్ళీ సంవత్సరం ఆగితే కాని దసరా రాదు. ఈ సరదా కూడా రాదు.

**గౌరవ్** : మీరు పండుగల గురించి రకరకాల విషయాలు, కథలు చెప్తారని ప్రణవి చెప్పింది. ఈ రోజు మీరు మాకు దసరా గురించి చెప్తారా!

**నాన్నమ్మ** : తప్పకుండా! ఈ పండుగని శరదృతువులో ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నుండి దశమి వరకు జరుపుతారు. ఈ తొమ్మిది రోజులు దేవీ పూజలు చేస్తారు. అందువలన ఈ పండుగను 'దేవీ నవరాత్రులు' అని కూడా అంటారు.

**మేరి** : క్రీస్తు పుట్టిన రోజును క్రిస్మస్‌గా జరుపుకుంటాం. మరి ఈ దసరా ఏ సందర్భంగా చేస్తారు.

**నాన్నమ్మ** : పూర్వం మహిషాసురుడు అనే రాక్షసుడు దేవతలను, ప్రజలను బాధించేవాడు. వారంతా విష్ణుమూర్తికి, శివునికి మొరపెట్టుకున్నారు. వారు దేవిని సృష్టించి అనేక ఆయుధాలు బహుకరించారు. ఆమె మహిషాసురునితో తొమ్మిది రోజులు యుద్ధం చేసి చివరికి ఆ దుర్మార్గుని సంహరించింది. ఆ ఆనందంతో ప్రజలు ఈ పండుగను జరుపుకుంటున్నారు.

**ప్రణవి** : నాన్నమ్మా! దసరా పండుగను విజయదశమి అని కూడా అంటారు కదా! ఎందుకు?

**నాన్నమ్మ** : పాండవులు ఈ దశమి రోజున శమీవృక్షాన్ని పూజించి ఆయుధాలు ధరించి కౌరవులపై విజయం సాధించారు. అదే విధంగా శ్రీరాముడు ఈ దశమి నాడే దేవీవ్రతం చేసి రావణాసురుని సంహరించి విజయం పొందాడు. అందుకే దీన్ని విజయదశమి అంటారు.

**లక్కీ సంగ్ :** భారతదేశం అంతా ఈ సమయంలో దాండియా ఆడుతారా?

**నాన్నమ్మ :** లేదు. దక్షిణ భారతదేశంలో కొన్ని ప్రాంతాలలో బొమ్మల కొలువులు పెడతారు. వాహన పూజలు, ఆయుధ పూజలు చేస్తారు. వివిధ రంగులు పూసుకొని దసరా వేషాలు వేస్తారు. వాటిలో పులి వేషం ముఖ్యమైనది.

**మేరీ :** మరి ఉత్తర భారతదేశంలో ఏం చేస్తారు?

**నాన్నమ్మ :** ఉత్తర భారతంలో రామలీల ఉత్సవాలు జరుపుతారు. పిల్లలు, పెద్దలు కలిసి దాండియా కూడా ఆడ్తారు.

**గౌరవ్ :** నేను క్రిందటి దసరా పండుగకు మా అత్తయ్య వాళ్ళింటికి ఖమ్మం వెళ్ళాను. అక్కడ బతుకమ్మ పండుగ అని చేశారు. రకరకాల పూలతో బతుకమ్మని అలంకరించి దాని చుట్టూ పాటలు పాడుతూ చప్పట్లు చరుస్తూ తిరిగారు. చివరకు నీళ్ళలో నిమజ్జనం చేసారు.

**నాన్నమ్మ :** ఇన్ని విషయాలు తెలుసుకున్న తర్వాత మీకేం అనిపిస్తుందో చెప్పండి.

**పిల్లలు :** చెడు మీద ఎప్పుడూ మంచి గెలుస్తుంది అనిపిస్తుంది.

**నాన్నమ్మ :** ఔనౌను. నిజమే. అదిగో మీ దాండియా మొదలైంది. వెళ్ళండి. నేను ఇక్కడ కూర్చుని మిమ్మల్ని చూస్తాను.

---

## I. వినండి-సంభాషించండి.

1. జాతీయ పండుగలు అంటే ఏమిటి? అవి ఏవి?
2. నీకు నచ్చిన పండుగను గూర్చి మిత్రునికి వివరించు.
3. క్రిస్మస్, రంజాన్ పండుగలు ఎలా జరుపుకుంటారు? చర్చించండి.

## II. చదవండి-ఆలోచించండి-రాయండి.

### అ. కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.

1. దసరా పండుగ ఎప్పుడు జరుపుకుంటారు?
2. మహిషాసుర వృత్తాంతాన్ని తెలపండి.
3. 'విజయదశమి' అని ఎందుకన్నారు?
4. దక్షిణ భారతంలో ఈ దసరా పండుగ ఎలా జరుపుతారు?
5. దసరా పండుగ ఉత్తర భారతంలో జరుపుకునే తీరును వివరించండి.

### ఆ. కింది పండుగలు ఏయే మాసాల్లో వస్తాయో ఆలోచించి జతపరచండి.

| | |
|---|---|
| 1. కృష్ణాష్టమి | అ. ఆశ్వయుజం |
| 2. వినాయక చవితి | ఆ. చైత్రం |
| 3. ఉగాది | ఇ. శ్రావణం |
| 4. దసరా | ఈ. భాద్రపదం |

### ఇ. ఖాళీలను సరియైన పదాలతో పూరించండి.

1. దసరా పండుగను ———— జరుపుకుంటారు.
   (అ) మూడు రోజులు (ఆ) తొమ్మిది రోజులు
2. దసరా పండుగను ———— అని కూడా అంటారు.
   (అ) భోగి (ఆ) విజయదశమి
3. పూర్వం ———— అనే రాక్షసుడు దేవతలను, ప్రజలను బాధించేవాడు.
   (అ) మహిషాసురుడు (ఆ) తారకాసురుడు

**శబ్ద కాలుష్యం కాని రీతిలో పండుగలు, ఉత్సవాలు జరుపుకుందాం**

## III. భాషావగాహన

**అ. వచనము మార్చి రాయండి.**

1. రాజు = ________
2. వాయిద్యాలు = ________
3. రాక్షసుడు = ________
4. పండుగ = ________

**ఆ. కింద వాక్యాలను కుండలీకరణంలో ఇవ్వబడిన సరైన విభక్తులతో పూరించి రాయండి.**

(ని, గురించి, తో, ను, లో)


1. ఈ రాత్రి [ ] దాండియా ఆడటం అయిపోతుంది.
2. దసరా పండుగ [ ] చెప్తారా?
3. ఈ పండుగ శరదృతువు [ ] జరుపుకుంటారు.
4. వారు దేవి [ ] సృష్టించారు.
5. రకరకాల పూలతో బతుకమ్మ [ ] అలంకరిస్తారు.

**ఇ. గీతగీసిన పదాలు కుండలీకరణంలో అడిగిన విధంగా రాయండి.**


1. <u>మీరు</u> పండుగల గురించి చెపుతారు. (భాషాభాగము)
2. <u>దేవీ</u> పూజలు చేస్తారు (వాచకము)
3. పాండవులు విజయం సాధించారు (కాలము)
4. కొన్ని ప్రాంతాల్లో బొమ్మల <u>కొలువులు</u> పెడతారు (వచనము)

## IV. అ. దసరా, సంక్రాంతి పండుగలను ఎలా జరుపుకుంటారో కింది అల్లిక ఆధారంగా 10 వాక్యాలు రాయండి.

**1. దసరా:-**




**2. సంక్రాంతి:**




**నేనివి నేర్చుకున్నా.**

- వివిధ ప్రాంతాలలో దసరా ఎలా జరుపుకుంటారు.

